క్లుప్తంగా

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో వివిధ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు నార్త్ సౌత్ ఫౌండేషన్ ఉపకార వేతనాలు పంపిణీ చేసింది. కాలేజీలో గురువారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రత్నం చిట్టూరిచే స్థాపించబడిన నార్త్ సౌత్ ఫౌండేషన్ వృత్తి విద్యా ప్రతిభావంతులైన పేద విద్యార్థులు ఉపకర వేతనాలు అందజేస్తోంది. ఇందులో భాగంగా విజయవాడ నార్త్ సౌత్ ఫౌండేషన్ చాప్టర్ కో ఆర్డినేటర్ లయన్ వెంకటరత్నం 10 మంది విద్యార్థులకు రూ.1.60 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ప్రతిభ చూపే విద్యార్థులకు నార్త్ సౌత్ ఫౌండేషన్ అండగా ఉంటుందని వెంకటరత్నం చెప్పారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, గణిత శాస్త్ర విభాగాధిపతి హరిప్రసాద్ పాల్గొన్నారు.

20న హుండీ కానుకల లెక్కింపు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఈ నెల 20వ తేదీన హుండీ కానుకల లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి యువీ.ప్రసాదరావు తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ అమ్మ వారి హుండీ లెక్కింపు 20వ తేదీన, భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరల వేలం 21వ తేదీన ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు. భక్తులు హుండీ కానుకల లెక్కింపు, చీరల వేలంలో పాల్గొనాలని కోరారు.

ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం

ఉంగుటూరు: ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని సర్పంచ్ బండి వెంకటలక్ష్మి తెలిపారు. ఇందుపల్లిలో రూ.2 కోట్లతో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని బుధవారం సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని వర్గాల వారికి విద్య, వైద్యం, ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. ఇప్పటికే అర్హత ఉన్న వారందరికీ ఇళ్ల స్థలాలు, నాడు నేడు ద్వారా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి, ఆధునిక హంగులతో ఆస్పత్రులను ఏర్పాటు చేశారని తెలిపారు. పీహెచ్‌సీ ద్వారా 10 గ్రామాలకు వైద్య సేవలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు బి.శిరీష, సుబ్బారావు, ఉప సర్పంచ్ వీర్ల వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత వైద్యశిబిరం

గన్నవరం: స్థానిక విశ్రాంత ఉద్యోగుల సేవాభవన్‌లో ఈ నెల 15వ తేదీ శుక్రవారం రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం యూనిట్ అధ్యక్షుడు ఆవుటపల్లి మోహన్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన మాక్స్‌విజన్ కంటి ఆస్పత్రి, కృష్ణసాయి దంత వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు జరిపి మందులు అందజేస్తారన్నారు. శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఐడీఎఫ్‌సీ సహకారం

గన్నవరం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ రీజినల్ బిజినెస్ మేనేజర్ కోడూరి నాగభూషణం తెలిపారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ సీఎస్‌ఆర్ ఫండ్ కింద రూ. 1.70 లక్షలతో మరమ్మతులు చేసిన టాయిలెట్స్‌ను బుధవారం వినియోగంలోకి తీసుకువచ్చారు. కోడూరి మాట్లాడుతూ.. మహిళా సాధికారితలో భాగంగా టాయిలెట్స్‌కు మరమ్మతులు చేయించామన్నారు. పాఠశాల అభివృద్ధికి, మౌలిక సదుపాయల కల్పనకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న దాతలు, సంస్థలకు హెచ్ఎం డి.ఝాన్సీరాణి కృతజ్ఞతలు తెలిపారు. దాతలు అందిస్తున్న సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంక్ డివిజనల్ మేనేజర్ ఎం.వెంకటశివరావు, గన్నవరం శాఖ మేనేజర్ మధుసూదనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నదాతల సమస్యలను పరిష్కరించాలి

కంకిపాడు: అన్నదాతల సమస్యలను పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి వి.శివశంకర్, కౌలురైతు సంఘం మండల కార్యదర్శి వి.మరియదాసు విజ్ఞప్తి చేశారు. అఖిలపక్ష రైతుసంఘాల సమన్వయ సమితి కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మండేపూడి భవన్‌లో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, అన్ని పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో రెండు లక్షల కోట్ల రూపాయలు కేటాయించి 200 రోజులు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలను విరమించుకోవాలని, ఆహార భద్రత కల్పించాలన్నారు. ఈ డిమాండ్ల సాధనకు రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఉదయం కంకిపాడు సెంటర్‌లో నిరసన ధర్నా చేపట్టామన్నారు. ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులు గెలుపే లక్ష్యంగా శ్రమించాలి

మంత్రి జోగి రమేష్



ఉయ్యూరులో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జోగి రమేష్, నాయకులు

ఉయ్యూరు: వైఎస్సార్ సీపీ శ్రేణులు గెలుపే లక్ష్యంగా శ్రమించాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని మసీదు సెంటరులో వైఎస్సార్ సీపీ ఉయ్యూరు నూతన కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. కష్టించి పనిచేసే కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేయాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ మాయకూటమి కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలన్నారు. వై నాట్ 175 లక్ష్యంగానే ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చీలి కల్పన, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సద్దాం, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. మంత్రి జోగి రమేష్‌కు ముస్లింలు ఘనస్వాగతం పలికారు.

విష్ణాలయం చైర్మన్‌గా లోయ చింతయ్య

విష్ణాలయం చైర్మన్‌గా లోయ చింతయ్య బాధ్యతలు స్వీకరించారు. దేవదాయ శాఖ విష్ణాలయానికి నూతన పాలకవర్గాన్ని నియమించింది. రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ సమక్షంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ నూతన పాలకవర్గం చేత ప్రమాణస్వీకారం చేయించారు. చైర్మన్‌గా లోయ చింతయ్య, సభ్యులుగా జి.లక్ష్మీఅన్నపూర్ణ, వి.వెంకటేశ్వరరావు, జి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, వి.వెంకటలక్ష్మి, వి.నాగమణి, ఎక్స్ అఫిషియో సభ్యుడుగా అర్చకుడు వెంకటరమణ శర్మ నియమితులయ్యారు. ఆలయ ఈఓ సురేష్‌బాబు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి చైర్మన్ జంపాన కొండలరావు, వార్డు కౌన్సిలర్ ఊర శ్రీవాణి, గోన మదన్, జంపాన స్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి

ఉయ్యూరు: సంక్షేమ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ కోరారు. ఉయ్యూరు పట్టణంలోని 15వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రానికి మరోసారు సీఎం ఎందుకు కావాలనే ఆవశ్యకతను ప్రజలకు వివరించారు.

జగనన్నకు అండగా నిలవాలి..

మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. అర్హతే కొలమానంగా, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌దేనని చెప్పారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో ఏ ఒక్క మంచి పనైనా చేశాడా? అని ప్రశ్నించారు. ప్రజలకు మంచి చేయటం చేతగాని దద్దమ్మలంతా కలిసి కూటమిగా ఏర్పడి ఎన్నికల్లోకి వస్తూ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధపడుతున్నారన్నారు. ప్రజలంతా అప్రమత్తతతో కుట్రలు, కుయుక్తులను అధిగమించి జగనన్నకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా మాజీ అధ్యక్షుడు అబ్దుల్ రహీమ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసా బేగం, వార్డు కౌన్సిలర్లు ఎం.లక్ష్మి, రాజులపాటి చిన్ని, డాక్టర్ జంపాన పూర్ణిమ, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ బాలి, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, షాదీఖానా కమిటీ చైర్మన్ అహ్మద్‌ఖాన్, నాయకులు బ్రహ్మం, ఇందిరా ప్రియదర్శిని, జ్యోతిర్మయి పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి జోగి రమేష్, నాయకులు

సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న చిన్నమస్తాన్, నాయకులు

గన్నవరం: నూర్‌బాషా కులస్తుల్లో ఆత్మగౌరవం నింపేలా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడం పట్ల ఆ సంఘ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు దావాజిగూడెంలోని పామర్తినగర్‌లో నూర్‌బాషా, దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం చేశారు. తొలుత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు పులిమర్తి చిన్నమస్తాన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఉత్తర్వులు ప్రకారం నూర్‌బాషా(దూదేకుల)ను కులం పేరుతో దూషిస్తే శిక్ష తప్పదని చెప్పారు. తద్వారా రాష్ట్రంలోని 25 లక్షల మంది నూర్‌బాషాల ఆత్మగౌరవాన్ని రాష్ట్ర ప్రభుత్వం కాపాడిందని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం తమ కులాన్ని మాయమాటలతో మోసగిస్తే, సీఎం వైఎస్ జగన్ మాత్రం తమను ఆదరించి అండగా నిలిచారని చెప్పారు. నూర్‌బాషాల సంక్షేమం కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు పలు పథకాలు ద్వారా లబ్ధి చేకూర్చిందన్నారు. నూర్‌బాషాల తరుపున సీఎం వైఎస్. జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ అధ్యక్షుడు డి.రసూల్, ప్రధాన కార్యదర్శి రహీం, మండల మహిళా అధ్యక్షురాలు షేక్ జమాల్‌బీ, సంఘ నాయకులు చాన్‌బీ, రెహమాన్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



విగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ

పెనమలూరు: పెనమలూరు గ్రామం వంతెన వద్ద నూతనంగా నిర్మించిన శ్రీగోపాలకృష్ణస్వామి ఆలయంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివార్ల విగ్రహాలను బుధవారం గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు తెలుపుతూ ఈ నెల 14వ తేదీ గురువారం గోపూజ, దీక్షారాధన, పుణ్యాహవాచనం, దీపారాధన పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. శుక్రవారం కలశారాధన, నవగ్రహ పూజ, నవగ్రహ హోమాలు, మహాశాంతి హోమం, శనివారం ఉదయం 8.30 గంటలకు గోపూజ, విష్వక్సేన పూజ, యంత్రస్థాపన, పూజలు నిర్వహిస్తామన్నారు. శనివారం ఉదయం 10.26 గంటలకు శ్రీగోపాలకృష్ణస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ధ్వజస్తంభ, గరుత్మంత, జయవానయుల ప్రతిష్ఠ, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు జరుగుతుందన్నారు. అనంతరం భక్తజన సందోహం మధ్య స్వామివారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరుగనుంది. ఉదయం 11 గంటల నుంచి భక్తులను అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.

పేదల సొంతింటి కల నెరవేర్చిన ప్రభుత్వం



పట్టాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

గన్నవరం: పేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. గన్నవరంలోని నాలుగు గ్రామ సచివాలయాల పరిధిలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు బుధవారం రిజిస్ట్రేషన్ చేసిన దస్తావేజులను పంపిణీ చేశారు. ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, సర్పంచ్ నిడమర్తి సౌజన్య చేతుల మీదుగా పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందన్నారు. ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చొరవతో జిల్లాలోనే అత్యధికంగా గన్నవరం నియోజకవర్గంలోని 27 వేల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించామని చెప్పారు. సదరు ఇళ్ల స్థలాలపై లబ్ధిదారులకు పూర్తి హక్కు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ పట్టాలు అందజేస్తున్నామన్నారు. పేదలకు ఇంతగా మేలు చేసిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వంశీమోహన్‌ను నిండు మనసుతో ఆశీర్వాదించాలని కోరారు. ఎంపీటీసీ మాజీ సభ్యులు సర్నాల ఆంజనేయులు, పార్టీ నాయకులు నిడమర్తి నాగేశ్వరరావు, పొలిమేర పేతురు, కుర్రాటి అరుణకుమారి, రెవెన్యూ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ

ఉయ్యూరు: పేదలకు నివేశనస్థలాలు అందజేసి శాశ్వత భూ హక్కు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం అన్నారు. సుందరంపేటలో పేదలకు నివేశన స్థలాల రిజిస్ట్రేషన్ పట్టాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కలాం మాట్లాడుతూ సీఎం జగన్‌ను పేదలు గుండెల్లో పెట్టుకుని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గోన మదన్, రాజులపాటి చిన్ని, ప్రభుత్వాస్పత్రి చైర్మన్ జంపాన కొండలరావు, శివాలయం చైర్మన్ సీహెచ్ కుటుంబరాజు, నాయకులు కొండపల్లి రమేష్, వేగిరాతి శ్రీను, కె.అప్పారావు, షేక్ షైలా, వెన్నెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంపై దృష్టి సారించాలి



పెనమలూరులో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ తాహెరా సుల్తానా

పెనమలూరు: విద్యార్థులు లక్ష్యంపై దృష్టి సారించి, ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యా శాఖాధికారి తాహెరా సుల్తానా సూచించారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మా బడికి రండి మేడం కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యా విధానంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకు వచ్చిందన్నారు. విద్యార్థులు లక్ష్యసాధన కోసం అవకాశాలు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డీఈఓ టోఫెల్ బోధన పద్ధతులు, విద్యార్థులు అనుసరిస్తున్న ప్రణాళికలు పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు సమీక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవాని, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడి తొలుచు పురుగులతో అప్రమత్తత అవసరం



మామిడికి సోకిన తొలుచు పురుగు

నున్న(విజయవాడరూరల్): మామిడి పండ్లకు సోకే తొలుచు పురుగులతో రైతులు అప్రమత్తంగా ఉండాలని విజయవాడ రూరల్ మండల ఉద్యాన శాఖాధికారి పెద్దిరెడ్డి పరమేశ్వరరెడ్డి సూచించారు. నున్న గ్రామంలో భూక్యా సాంబయ్య నాయక్, మరి కొందరు రైతులకు చెందిన మామిడి తోటల్లో కాయలను పరమేశ్వరరెడ్డి, సహాయకుడు శ్యామ్ బుధవారం పరిశీలించారు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా మామిడి తోటల్లో కాయలకు తొలుచు పురుగుల ఉధృతి అధికంగా ఉందన్నారు. పురుగులను రైతులు ఎప్పటికప్పుడు పరిశీలించి నివారించాలన్నారు. లేని ఎడల దిగుమతులు అనుహ్యంగా తగ్గిపోయి రైతాంగం నష్టపోయే ప్రమాదం ఉందని చెప్పారు. మామిడి తొలుచు పురుగును గుర్తించిన వెంటనే రైతులు అలాంటో(థియాక్లోప్రిడ్ 240 ఎస్సీ 21.7) అనే మందును లీటరు నీటిలో 1 మిల్లీలీటరు అజాడిరాక్టిన్ 1500 పీపీఎం 3 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. దారాల పురుగులు కూడా మామిడి తోటల్లో గుర్తించామని, వాటి నివారణకు రిలాన్(క్రిమి సంహారిణి) 0.5 గ్రాముల మందును లీటరు నీటిలో పిచికారీ చేయాలని సూచించారు.

కేంద్ర బలగాల ఫ్లాగ్ మార్చ్



కోలవెన్నులో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

కంకిపాడు: రానున్న ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా శాంతిభద్రతలను పరిరక్షించేందుకు సమర్థంగా చర్యలు తీసుకుంటున్నామని కంకిపాడు సీఐ వీ.శ్రీనివాసరావు, ఎస్ఐ డి.సందీప్ అన్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ఆదేశాలతో డీఎస్పీ జయసూర్య పర్యవేక్షణలో ఈడుపుగల్లు, పునాదిపాడు, గొల్లగూడెం, కోలవెన్ను, కుందేరు గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. అసాంఘిక శక్తుల ఆటకట్టిస్తామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ అజెండా



సావరగూడెంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎంపీపీ రవి, నాయకులు

గన్నవరంరూరల్: ప్రజల సంక్షేమమే అజెండాగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా నిలవాలని ఎంపీపీ అనగాని రవి పిలుపునిచ్చారు. సావరగూడెం గ్రామంలో రూ.87.08 లక్షలతో నిర్మించిన సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ భవన సముదాయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. సమాజంలోని అన్ని వర్గాలు అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షతో సంక్షేమ పథకాలను ప్రతి గడపకు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదన్నారు. గ్రామంలో సేవలన్నీ ఒకే చోట ఏర్పాటు చేయటం ద్వారా గ్రామ స్వరాజ్యాన్ని గ్రామంలో నెలకొల్పామని చెప్పారు. సర్పంచ్ అట్ల నాగేశ్వరరావు అధ్యక్షత వహించిన సభలో జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య మాట్లాడుతూ.. ఆడబిడ్డ గీతాంజలిని ప్రతిపక్షాలు పొట్టనబెట్టుకున్నాయన్నారు. ఆమెను స్మరిస్తూ నిమిషం పాటు సభ మౌనం పాటించింది. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి మాట్లాడుతూ.. గ్రామంలో ప్రభుత్వ భవనాలు సముదాయం నిర్మించిన సర్పంచ్ అభినందనీయుడని అన్నారు. గ్రామపార్టీ కన్వీనర్ అర్జా విష్ణువర్ధన్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, రాచమళ్ల యల్లారావు, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరమ్మ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కె.గోపాలరావు, డైరెక్టర్ పామర్తి మాధవరావు, మండల జేసీఎస్ చైర్మన్ కైలే శివకుమార్, పంచాయతీ కార్యదర్శి కోట సురేష్‌బాబు, స్థానిక పంచాయతీ వార్డు సభ్యులు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు. సభ అనంతరం సర్పంచ్ అట్ల నాగేశ్వరరావును నాయకులు, అధికారులు సత్కరించారు.

పారిశుద్ధ్య కార్మికులకు టవల్స్ పంపిణీ



టవల్స్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ వరి శ్రీదేవి

రామవరప్పాడు: రామవరప్పాడు పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి బుధవారం సర్పంచ్ వరి శ్రీదేవి టవల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ మనందరి ఆరోగ్యాలను పరిరక్షిస్తున్న పారిశుద్ధ్య సిబ్బందిని గౌరవించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను పణంగా పెట్టి పారిశుద్ధ్య సిబ్బంది తమ విధులను నిర్వర్తించారని గుర్తు చేశారు. మండల కిరాణా మర్చంట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జూలూరు నాగేశ్వరరావు తండ్రి జూలూరు రంగారావు జ్ఞాపకార్థం టవల్స్ అందజేశారన్నారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఉరిమి సుబ్రహ్మణ్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీ పేరూరి రామ్మోహన్ పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ శిరీషకు డాక్టరేట్



శిరీషాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శివాజీబాబు

పెనమలూరు: కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఉద్దగిరి శిరీషాకు డాక్టరేట్ లభించింది. ఆమె అమరావతిలోని వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయంలో సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ సాయి చందన పర్యవేక్షణలో చేసిన పరిశోధనలకు ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో శిరీషాను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, అధ్యాపకులు అభినందించారు.

సీఏఏకు వ్యతిరేకంగా నిరసన



నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

గన్నవరం: భారత రాజ్యాంగ స్ఫూర్తిని బీజేపీ దెబ్బతీస్తోందని సీపీఎం జిల్లా నాయకుడు ఆర్.రఘు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సీఏఏకు వ్యతిరేకంగా బుధవారం వామపక్షాల ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ.. దేశంలో హిందూ తాలిబాన్ల రాజ్యాన్ని స్థాపించడం కోసం సీఏఏను బీజేపీ తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టం వల్ల దేశానికి ప్రమాదం పొంచి ఉందన్నారు. దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఇటువంటి మతోన్మాద బీజేపీతో టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకోవడం దుర్మార్గమన్నారు. వామపక్ష నాయకులు కాట్రగడ్డ జోషి, కళ్లం వెంకటేశ్వరరావు, మల్లంపల్లి ఆంజనేయులు, అనుమోలు వెంకటేశ్వరరావు, జయమ్మ పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లమాంబ ఆదర్శనీయం



నున్న నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

నున్న(విజయవాడరూరల్): సంస్కృతంలోని రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన మహిళా కవయిత్రి మొల్లమాంబ వర్తమాన కవులకు ఆదర్శనీయమని ఎన్టీఆర్ జిల్లా శాలివాహన సంఘం అధ్యక్షుడు బొమ్మిన శ్రీనివాసరావు తెలిపారు. కవయిత్రి మొల్లమాంబ జయంతి కార్యక్రమం బుధవారం నున్న గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లమాంబ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బొమ్మిన శ్రీనివాసరావు మాట్లాడుతూ.. శాలివాహన సామాజిక వర్గానికి చెందిన కవయిత్రి మొల్లమాంబ రామాయణాన్ని తెలుగులోకి అనువదించడం ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాటూరి సరళ, ఉప సర్పంచ్ కలకోటి బ్రహ్మానందరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, దండు సుబ్రహ్మణ్యం రాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ, పాలకవర్గం సభ్యులు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వీరపనేనిగూడెం పీఏసీఎస్‌కు అభినందన



సొసైటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డిని, సిబ్బందిని అభినందిస్తున్న బ్యాంక్ అధికారులు

గన్నవరంరూరల్: సహకార రంగంలో నూరు శాతం రుణాల వసూలులో ఎప్పుడూ కృష్ణాజిల్లా గన్నవరం మండలం వీరపనేని గూడెం పీఏసీఎస్ ముందుంటుంది. ప్రతి సంవత్సరం ఈ సొసైటీ రుణాల వసూలులో నూరు శాతం పూర్తి చేసినట్లు చైర్మన్ బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. 2023–24 సంవత్సరానికి 1,212 మందికి క్రాప్ లోన్, లాంగ్ టర్మ్ రైతు నేస్తం, డ్వాక్రా మహిళలకు రుణాలు అందజేసి గడువుకు ముందుగానే వసూలు చేశామన్నారు. రైతులు, సిబ్బంది సహకారంతో ప్రతి సంవత్సరం నూటికి నూరు శాతం రుణాలు వసూలు చేస్తున్నట్లు వివరించారు. ఈ మేరకు చైర్మన్ శ్రీనివాసరెడ్డిని, సీఈఓ వడ్లమూడి అశోక్ కుమార్‌ను, స్టాఫ్ నందూరి శ్రీనివాసరావును చీఫ్ మేనేజర్ కోటేశ్వరరావు, గన్నవరం సహకార బ్యాంకు మేనేజర్ షబ్బీర్, సూపర్‌వైజర్ నాగేశ్వరరావు గన్నవరం సహకార బ్యాంకులో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు.

జెడ్పీ హైస్కూల్‌కు క్రీడా సామగ్రి అందజేత

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం కానుమోలులోని జెడ్పీ హైస్కూల్‌కు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఖోఖో పోల్స్, క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజకు బుధవారం సామగ్రిని మానవత సభ్యులు అందజేశారు. మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బాచారి, కల్లేపల్లి నారాయణరావు పాల్గొన్నారు.